


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 656 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర గురువారం 05 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం




# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాఎగురవేస్తాం

**- సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి పునాది -మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపు**

**- కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

మేడ్చల్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : మేడ్చల్ నియోజకవర్గంలో మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి పునాదిగా నిలుస్తాయని రాష్ట్ర రోడ్లు, భవనాలు ఠ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ నియోజకవర్గం మూడుచింతలపల్లి--అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమాల శ్రీకారోత్సవంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన, ఎమ్మెల్సీ చీఫ్ విప్ పత్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ లతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వంగా రెండు సంవత్సరాల వ్యవధిలో అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.




# సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు

**- దేశంలో 55 సోలార్ పార్కులకు అనుమతులు**

**- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం**



కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ వెల్లడించారు. సోలార్ విద్యుత్ ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలపై బుధవారం కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్రమంత్రి వివరాలు వెల్లడించారు. సోలార్ పార్కులు మరియు అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టుల అభివృద్ధి పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు ఇప్పటివరకు 55 సోలార్ పార్కులు మంజూరు ద్వారా 39, 973 మెగా వాట్ల విద్యుత్ మంజూరు చేయగా, ఇందులో 16,121 మెగావాట్ల విద్యుత్తు కమిషన్ చేయబడి, 8,176 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని, ఇందులో భాగంగా గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ కు రూ.105.5 కోట్లు మంజూరు చేయడంతో పాటు 4,200 మెగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పవన్ కళ్యాణ్

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శ్రీ ఈ నెల 11న జరగనున్న తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రచార కార్యక్రమాలలో పాల్గొననున్నారు. జనసేన పార్టీ -- భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ, 7 మరియు 8 తేదీలలో తెలంగాణలోని పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ ఎన్నికల ప్రచార షెడ్యూల్ రూట్ మ్యాప్ త్వరలో ప్రకటించనున్నారు.








## భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం సతీమణి అన్నా లెజినోవా

వరంగల్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తన కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్‌లోని చారిత్రాత్మక భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం అన్నా లెజినోవా తన పిల్లలతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నా లెజినోవా భారతీయ సంప్రదాయంపై ఎంతో మక్కువ చూపుతుంటారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని శక్తిపీఠాల్లో ఒకటైన భద్రకాళి ఆలయాన్ని ఆమె సందర్శించడం విశేషం.

# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?: - రేవంత్ రెడ్డి




“భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?” అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు “ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు” అని రేవంత్ రెడ్డి అన్నారు. “ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు.

# మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాఎగురవేస్తాం

ఎన్నికల హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహజ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఘన విజయం అందించాలని ఆయన కోరారు.

– ప్రజల నమ్మకమే కాంగ్రెస్ బలం : వజ్రేష్ యాదవ్

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్నాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మూడు చింతలపల్లి, అలియా బాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమాలను మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వీరారెడ్డి చౌరస్తా వద్ద, అలాగే అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అలియాబాద్ చౌరస్తా వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ ఎన్నికల ఇన్చార్జ్ మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, అమర్ సింగ్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్, మేడ్చల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కార్యసాధకుడు కపీశ్వరుడు



సుందరకాండ పారాయణ చేస్తే ఆగిపోయిన పనులు కూడా అయిపోతాయని లోకంలో ప్రతీతి.

అలా చెప్పడంలో పెద్దల ఉద్దేశ్యం కేవలం పారాయణ చేసినంతలో ఏదో హనుమచ్ఛక్తి కిందికి దిగి వచ్చి మన పనులన్నీ చేసి పెట్టేస్తుందని కాదు.

సుందరకాండ మొత్తం సావకాశంగా, సావధానంగా చదివితే.. కార్యసాధనలో ఎదురయ్యే ఆటంకాలు ఎన్ని రకాలుగా ఉంటాయో, వాటిని ఏ రకంగా తొలగించుకోవాలో అవగాహన చేసుకొంటారని పెద్దల ఉద్దేశం.

ఏ విషయాన్నైనా అవగాహన చేసుకొని వాటిని మన జీవితానికి అన్వయం చేసుకొని ఆచరణలో పెడితే కాని పని ఉంటుందా?

హనుమంతుడు సముద్రలంఘనం చేస్తుంటే మూడు రకాల ఆటంకాలేర్పడ్డాయి.

మైనాక పర్వతం మర్యాద చేయడానికి అడ్డంగా వచ్చి నిలబడింది.

ఇది సాత్వికాటంకం.

తర్వాత సురస అనే రాక్షసి ఆకాశమార్గానికి అడ్డంగా వచ్చి.. తన నోట్లో ప్రవేశించకుండా ఏ ప్రాణీ ముందుకు వెళ్లలేదని పంతం పట్టింది.

ఇది రాజసాటంకం.

ఆ తర్వాత సింహిక అనే ఛాయాగ్రాహిణి మాటామంతీ లేకుండా కిందికి లాగెయ్యడం మొదలుపెట్టింది.

ఇది తామసాటంకం.

కార్యసాధకుడైన హనుమంతుడు మూడు ఆటంకాలనీ మూడు రకాలుగా ఎదుర్కొన్నాడు.

మైనాకుడు మర్యాదలు చెయ్యడం కోసం అడ్డుపడ్డాడు కాబట్టి.. అతనితో మర్యాదగానే మాట్లాడి, తిరిగివచ్చేటప్పుడు ఆగుతానని చెప్పి దాటి వెళ్లిపోయాడు.

సురస ఆంజనేయుణ్ణి మింగేద్దామని నోరుతెరిచింది. ఆదిత్యయోగీ. స్వామి దాంతో పోటీపడి దానికి రెట్టింపు స్థాయిలో శరీరం పెంచాడు. కొంతసేపయ్యాక సమయం వృథా అవుతోందని గమనించి.. అతి సూక్ష్మ శరీరంతో దాంట్లోంచి బయటపడ్డాడు. రాజసాటంకాల నుండి బయటపడే ఉపాయం అది.

ఆ తర్వాత సింహిక.. ఆంజనేయుడి నీడ పట్టుకొని బలవంతంగా కిందికి లాగేస్తుంటే అది తమోగుణ ప్రవృత్తి అని గ్రహించి.. తన బలమంతా ఉపయోగించి దాన్ని పైకిలాగి ఒక్క గుద్దుతో పైలోకాలకి పంపేశాడు. అంటే తమో గుణానికి దండనతో బదులు చెప్పాడన్నమాట.

అలా మనం కూడా ఏదైనా ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకొన్నప్పుడు ఎదురయ్యే ఆటంకాలు ఏ రకమైనవో గమనించుకొని ఆ రకమైన ప్రవృత్తితోనే వాటిని ఎదుర్కోవాలి.

కొన్నింటిని మర్యాదగానే ప్రక్కకి తొలగించాలి. మరికొన్ని విషయాల్లో కొంతసేపు పోటీపడినా..



సూక్ష్మమైన ఉపాయాలను ఆలోచించి, ఆ పోటీ నుండి బయటపడి మన పని మనం చేసుకోవాలి.

తీవ్రవాదం వంటి సమస్యలను అంతే తీవ్రంగా ఎదుర్కొని ఉక్కుపాదంతో అణచివేయాలి. అక్కడ మెతకదనం పనికిరాదు.

ఒక్క వ్యక్తి జీవితానికైనా, మొత్తం వ్యవస్థలో మార్పులకైనా ఈ త్రిగుణాత్మక వ్యూహం బ్రహ్మాండంగా పనిచేస్తుంది.

ఈ రకంగా సుందరకాండలో ఘట్టాల్ని అవగాహన చేసుకొని, మన జీవితానికి అన్వయించుకుని ఆచరణలో పెడితే కాని పని అంటూ ఉంటుందా?

అందుకోసం సుందరకాండ అందరూ చదవాలి. కపీశ్వరుని కార్యసాధకత్వాన్ని అవగాహన చేసుకొని అనుసరించాలి.

– వ్యాస రచన :
– సాహితీబంధువు డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)
తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
చరవాణి :7416638823

# కవితా సమీక్ష - కాలమే గురువు

హద్దులు దాటిన ఆశనైనా
ఆకాశాన ఎగిరే మేఘమైనా
కాలానికి అతీతంగా ఏది నడవలేదు
సమయాన్ని దాటేసి ఏది ముందుకు పోలేదు
కాకమ్మ తెచ్చే కబుర్లు అయినా
కన్నీటి నుంచి జారే గీతికలైనా
గుండెల్లో బంధించిన జ్ఞాపకమైనా
తిరిగిరాని బంధపు జాడలైనా
సమయం ముగిస్తే దారులు వేరు
కాలంతో పరుగులు పెట్టినా తీరం వేరు...

కొన్ని కవిత్వాలు ఆకర్షిస్తాయి, మరికొన్ని కవిత్వాలు ఉత్తేజ పరుస్తాయి, ఇంకొన్ని కవిత్వాలు నిర్భయంగా వాస్తవాన్ని చెబుతాయి, ఇలాంటి కోవలోకి వస్తాయి ఆమె రాసిన కవిత్వాలు, జీవిత అక్షరాలు...

– ఇక కవిత్వం విషయానికి వస్తే...

– శీర్షిక : సమయం

సమయం
నడవదు...
మనల్ని నడిపిస్తుంది.

ఆగమని అడిగినా
వినదు,
వెనుదిరగమని కోరినా
లెక్క పెట్టదు.

గాయాలను మానుస్తూ,
జ్ఞాపకాలను చెరిపేస్తూ,
చివరకు నిశ్శబ్దాన్ని మిగులుస్తుంది.

సమయం
మన పక్షం కాదు,
మన శత్రువు కాదు,
సాక్షి మాత్రమే.

ఏం తీసుకెళ్లాలో
ఏం వదిలిపెట్టాలో
మాట్లాడకుండా నేర్పే
ఒక గురువు.

రచయిత : దుత్తలూరి లలిత శ్రీ

– సమీక్ష

సమయం నడవదట మనల్ని నడిపిస్తుందట వాస్తవమే కదా...

ఆగమని అడిగినా వినదని, వెను తిరగమని కోరినా లెక్కపెట్టదని, గాయాలను మాన్పుతూ, జ్ఞాపకాలను చెరిపేస్తూ, చివరకు నిశ్శబ్దాన్ని మిగులుస్తుందని వాస్తవికతను జోడించి కాలం మనకి నేర్పించే పాఠాన్ని ఉదారంగా వివరించారు రచయిత...

సమయం ఎప్పుడూ మన పక్షం కాదని అలాగే శత్రువు కూడా కాదని సాక్ష్యాన్ని చూపిస్తూ సాక్షిగా స్నేహమై నిలుస్తుందని, మనతో పాటు ఏమి తీసుకువెళ్లాలో, ఏమి వదిలి పెట్టాలో మాట్లాడకుండా నేర్పించే గొప్ప గురువు అని అభ్యుదయ భావాన్ని కలపోసి, అద్భుతమైన వర్ణనను అందించారు రచయిత...

కాలం కనిపించకుండా మన జీవితానికి గురువుగా నిలుస్తుంది, తగిలే ఎదురు దెబ్బలకు నిలబడేలా చేస్తుంది, కాస్త ఆలస్యమైనా నిజాన్ని చూపించి నమ్మకం అనే పదానికి అర్థం తెలిసేలా చేస్తుంది, పైశాచిక ఈ ప్రపంచంలోనే ప్రతి ఒక్కరి అంతర్గతాన్ని కాలమే బయటకు చూపిస్తుంది, లోపల దాచిన బాధను, కన్నీటిని, క్రోధాన్ని, అన్నిటినీ సమయమే బయటకు సాక్షాత్కరిస్తుంది, చెరగని జ్ఞాపకాలను కడ తేరే వరకు ఒక అద్భుతమైన కావ్యంగా లిఖించి మనసు పుటలలో నిలిచిపోయేలా చేస్తుంది...

ఇలాంటి మరెన్నో మనసుని హత్తుకునే కవనాలు మీ కలం నుంచి ఉద్భవించాలని, ఈ సాహితీ ప్రయాణంలో ఎందరో పాఠకుల జీవితాలకు మీ అక్షరాలు దిక్సూచిగా మారాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

సమీక్ష : భాను తేజశ్రీ పోలగాని



రచయిత : దుత్తలూరి లలిత శ్రీ   సమీక్ష : పోలగాని భానుతేజశ్రీ

# కేసీఆర్.. నువ్వెలా జాతిపిత అవుతావు?:

లులి, సన్నాసి, దొంగ అయిన నువ్వెలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు.

తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ.200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# కలెక్టర్ రాజాబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన దేవళ్ల భాస్కర్ రావు

ఒంగోలు,

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజా బాబుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేవళ్ళ భాస్కర్ రావుతో పాటు ఒంగోలు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జనసేన జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఉలవపాడు మండల జనసేన నాయకులు కేసవరపు లక్ష్మణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెర జాతి సమస్యల పరిష్కారానికి వారి జీవన ప్రమాణాలు సంక్షేమం సంబంధించిన పలు కూటమి ప్రభుత్వ నిర్ణయాలు పట్ల కలెక్టర్ రాజాబాబు తో భాస్కర్ రావు సమాలోచనలు జరిపారు.

# తెట్టు హైస్కూలుకు బీరువా బహూకరణ

గుడ్లూరు,

తెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ గత సం.. ఏప్రిల్ నెలలో పదవి విరమణ పొందిన పంకా మాలకొండయ్య బుధవారం పాఠశాలకు 10 వేల రూపాయల విలువైన ఇనుప బీరువాను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టేల చిన్నయ్య మరియు పాఠశాల ఉపాధ్యాయులు కలసి పంకా మాలకొండయ్యని ఘనంగా సన్మానం చేసి ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులి మామిడి మమత రాజు

సదాశివ పేట్)

సదాశివపేట పట్టణంలోని 12 వవార్డులో భారీ జనసంద్రోహంతో గడప గడప తిరుగుతూ ప్రతి ఓటరును ఆకర్షిస్తూ కరపత్రాన్ని పంచుతూ 12 వ వార్డు అభ్యర్థి పులిమామిడి మమత రాజు దంపతులిద్దరూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీ అందించగలరని ఓటరు మహాషయులను విజ్ఞప్తిచేశారు. ఇట్టి సందర్భంగా పులి మామిడి రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీలను ప్రజలకు అందజేస్తుందని అందువలనే ప్రజలందరూ కాంగ్రెస్ వెనకానే ఉన్నారని, బిఆర్ ఎస్ పార్టీ కనుమరుగై పోతుందని అన్నారు. సంగారెడ్డి మరియు సదాశివపేట రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందని వారు మీడియా ముఖంగా తెలియపరిచారు. ఇట్టి కార్యక్రమంలో 12 వ వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. అదేవిధంగా 12 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్ల బింబాధర్ చారీ, బక్కప్ప, ఫయాజ్, మొయిజ్, రియాజ్, షకీల్, సురేష్, పి. ఎం. ఆర్ యువసేన నాయకులు మాణిక్యం, పరమదాసు, సంగమేష్, అనిల్, అఖిల్, అంజి, రాము, సోమ శంకర్,ఖరీం, అభిమానులు, మహిళలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# కీ.శే. గట్టు ప్రసాద్ బాబు గారికి నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ నాయకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా ఫిబ్రవరి 4

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో కీ.శే. గట్టు ప్రసాద్ బాబు గారి దశదిన కర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం రాష్ట్ర పార్టీ మాజీ ఉపాధ్యక్షులు, వరంగల్ జిల్లా మాజీ కుడా చైర్మన్‌గా సేవలందించిన కీ.శే. గట్టు ప్రసాద్ బాబు గారి కుటుంబ సభ్యులు గట్టు స్వప్న, గట్టు రామ్ తిలక్, గట్టు సచిన్‌లను నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ అర్సనపల్లి విద్యాసాగర్ రావు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట రజనీకాంత్, టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముంజ వెంకట్రాజ్యం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మాదిరెడ్డి ధర్మారెడ్డి, మేకల రమేష్ యాదవ్, కాసర్ల ఏలియా, ఆరూరి రాజు, కలకోట రమేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కీ.శే. గట్టు ప్రసాద్ బాబు గారి సేవలను స్మరించుకున్నారు.

# లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**- ప్రజల సంక్షేమానికి సీఎం సహాయ నిధి భరోసా**

**- నందిగామ కాకాని నగర్‌లో 46 మంది లబ్ధిదారులకు రూ.22.86 లక్షల చెక్కులు పంపిణీ**

నందిగామ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : నందిగామ పట్టణం కాకాని నగర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.22,86,435/- (ఇరవై రెండు లక్షల ఎనభై ఆరు వేల నాలుగు వందల ముప్పై ఐదు రూపాయలు) విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు వంటి అనివార్య పరిస్థితుల్లో ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరపున సంపూర్ణ సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను దగ్గర నుంచి తెలుసుకుని, తక్షణ సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సంక్షేమ పాలన మరింత బలోపేతం అవుతోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎన్డీయే ప్రభుత్వానికి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి కృతజ్ఞతలు తెలిపారు.



# ఫోన్ కాల్‌కి స్పందించిన సర్పంచ్

**- తక్షణమే సమస్యకు పరిష్కారం చూపిన మడకం కుమారి ఆంధ్రయ్య**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (పీటర్) ఫిబ్రవరి 04 : నారాయణపురం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి జగన్నాధపురం గ్రామంలో బోరు సమస్య ఉంది. ఆ బోరు సరిగ్గా పనిచేయడం లేదని, తమకు తాగటానికి నీళ్లు ఉండడం లేదని గ్రామస్తులు గ్రామ పెద్దలకు పెద్దలకు చెప్పడంతో సర్పంచ్ మడకం కుమారిఆంధ్రయ్యతో ఫోన్ లో మాట్లాడి అక్కడ ఉన్న సమస్యను వివరించారు. తక్షణమే స్పందించిన సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య సంబంధిత అధికారులను పిలిపించి బోరు సమస్యను పరిష్కారం చేయడం జరిగింది. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్యకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరిటాల సందీప్ కుమార్, పెద్దపూడి సత్యవతి, సవరం సుబ్బారావు, గ్రామ పెద్దలు గొంది రమేష్, గొంది రాజు, గొంది రాజ్ కుమార్, గొంది రాణి, మడకం వీరబాబు తదితరులు పాల్గొన్నారు

# భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ వీరమ్మ తల్లి

**-- మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బి.రాజేంద్రప్రసాద్**

ఉయ్యూరు, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ఉయ్యూరులో వేంచేసి ఉన్న శ్రీ పారుపూడి కనక చింతయ్య వీరమ్మ తల్లి తిరునాళ్లు సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బి.రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు మాజీ సర్పంచ్ భ్రమరాంబల దంపతులు 6వ రోజు అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యూరులో అంగరంగ వైభవంగా వీరమ్మ తల్లి తిరునాళ్ళు 15 రోజులపాటు జరగడం మనందరం చేసుకున్న అదృష్టం అని, రాష్ట్రంలో మరి ఎక్కడా కూడా ఇంత పెద్ద ఎత్తున ఇన్ని రోజులు తిరణాలు జరగవని, ఈరోజు అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఉయ్యూరు మాజీ సర్పంచ్ భ్రమరాంబ మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు, ఉయ్యూరు పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుచేలుడు, శేషగిరి మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






# రెడ్ క్రాస్ జన ఔషధి మెడికల్ షాప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.

నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాప్ రూమును బుధవారం జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ జి. రాజకుమారి పరిశీలించారు. త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రారంభించబోయే మెడికల్ షాపుకు సంబంధించి కావలసిన సామాగ్రి ను, పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన మందులను తక్కువ ధరకే ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి జన ఔషధీ మెడికల్ షాపులను ప్రారంభిస్తున్నారని అందులో భాగంగా నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తేవడం జరుగుతుందన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా సెక్రెటరీ మరియు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ జిలాని భాష, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, రెడ్ క్రాస్ డీఎఫ్ఓ సమీ, ఫార్మసిస్టు ఇంద్రజ, మున్సిపల్ ఇంజనీర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎంఎఫ్ నిధుల కింద రూ.150 లక్షలు రోడ్డు అభివృద్ధి పనులకు మంజూరు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : కంచికచర్ల మండల పరిధిలో డీఎంఎఫ్ నిధుల కింద రోడ్డు అభివృద్ధి పనులకు రూ. 150 లక్షలు మంజూరయ్యాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామలోని వారి కార్యాలయంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో దొనబండ--కీసర రోడ్డును (ఎస్‌హెచ్-ఎస్ అమరవరం క్రాస్ రోడ్డు నుంచి మొగులూరు) కిలోమీటరు 14.00 నుంచి 21.028 వరకు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గనుల కార్యకలాపాల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా డీఎంఎఫ్ నిధుల కింద ఈ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు వెల్లడించారు. రోడ్డు అభివృద్ధి పూర్తయితే ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల కంచికచర్ల మండల ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని, నందిగామ నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ

**- బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని గడప గడపకు ప్రచారం చేసిన మెచ్చ నాగేశ్వరరావు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (పీటర్), ఫిబ్రవరి 04 : అశ్వారావుపేట మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ 15వ వార్డు అభ్యర్థి విజయం కోరుతూ అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు ముమ్మరంగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ 15వ వార్డు అభ్యర్థురాలైన ఆరేపల్లి వెంకట నాగ సౌజన్యని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, మున్సిపాలిటీ పురోభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.



# ఎమ్మెల్యే బండారు కృషితో కొత్తపేట నియోజకవర్గానికి ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు

**- నియోజకవర్గంలో నాలుగు మండలాలకు, 54 పనులకు గాను రూ.13.85 కోట్ల నిధులు మంజూరు**

**- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి 54 పనులకుగాను, రూ. 13.85 కోట్లను ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు మంజూరు అయ్యాయని బుధవారం ఆయన తెలిపారు. నిధులు మంజూరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలానికి రూ. 3.15 కోట్ల నిధులు, రావులపాలెం మండలానికి రూ. 3.60కోట్లు, కొత్తపేట మండలానికి రూ. 3.22కోట్లు, ఆలమూరు మండలానికి రూ. 3.88 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# నూతన వధువు రీనును ఆశీర్వదించిన దద్దాల



కనిగిరి టౌన్, :

కనిగిరి పట్టణం లోని 9 వ వార్డులో షేక్ బావర్చి కరిముల్లా - షమీమ్ గార్ల కుమార్తె రీను వివాహ హల్దీ వేడుకలో బుధవారం కనిగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొనటం జరిగినది. ఈ సందర్భంగా (వధువు) రీను ను, ఆశీర్వదించి,వివాహ శు భాకాంక్షలు తెలియజేసారు..

ఈ హల్దీ వేడుకలో ఇన్చార్జి దద్దాలతోపాటు, షేక్ అబ్దుల్ గఫార్,మడతల కస్తూరి రెడ్డి,గుంటక తిరుపతిరెడ్డి,షేక్ జిలానీ, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,పులి శాంతి,డాక్టర్ షేక్ నాయబ్ రసూల్,పోలక సిద్ధారెడ్డి,షేక్ ఖాసిం వలి, షేక్ రెహమాన్,షేక్ నాగూర్ వలి,మద్దిశెట్టి భారతి, షేక్ లతీఫ్,షేక్ రఫీ,షేక్ సందాని తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం

**- మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్**

ఎల్లారెడ్డిపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాదు వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 135 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ సుజాత, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. లబ్ధి పొందిన లబ్ధిదారులు కేకే మహేందర్ రెడ్డి మరియు సీఎం రేవంత్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ సుజాత, మండల ఫోరం అధ్యక్షుడు నారాయణపురం సర్పంచ్ దోమ్మటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# రేషన్ దుకాణాలు తనిఖీ చేసిన ఆర్డీవో

ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : నందిగామ డివిజన్ ఆర్డీవో బాలకృష్ణ కంచికచర్ల పట్టణంలో రేషన్ దుకాణాలు తనిఖీ నిర్వహించారు. పట్టణంలో ఉన్న 42వ రేషన్ దుకాణాన్ని తనిఖీ నిర్వహించి రేషన్ బియ్యం, పంచదార సరుకు వివరాలు తీసుకున్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుల వివరాలు, టైంకి ఇస్తున్నారా లేదా అని అక్కడ వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.








# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్


అమరావతి, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ప్రముఖ సినీ నటుడు, 'నటకిరీటి' డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే రాజేంద్ర ప్రసాద్ కి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డును ప్రకటించిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజేంద్ర ప్రసాద్ ని సాదరంగా ఆహ్వానించి, ఆయనను ఘనంగా సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై వైవిధ్యమైన పాత్రలతో కోట్లాది మంది ప్రేక్షకులను అలరించడమే కాకుండా, తెలుగు సినిమా ఖ్యాతిని పెంచినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు.



# బరాబర్ బాధపడుతున్నాను!! -జె.డి.చక్రవర్తి

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 04 : ఇటీవల తాను అతిథిగా పాల్గొన్న సినిమా ఫంక్షన్ లో జరిగిన దానికి బాధపడుతున్నానని తెలిపారు ప్రముఖ నటులు జె.డి.చక్రవర్తి. ఆయన మాట్లాడుతూ "సినిమాలకు ప్రచారం కల్పించేందుకు ఘోరంగా దిగజారిపోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. ఇటీవల నేను అతిథిగా పాల్గొన్న ఓ సినిమా ప్రమోషనల్ ఈవెంట్ లో... ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉండిపోయాను. మధ్యలోనే వచ్చేసి ఉండాల్సిందని ఇప్పుడు బాధపడుతున్నాను. సృజనాత్మకతమైన ఆలోచనలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాలే తప్ప, రోత పుట్టించే జుగుప్సాకరమైన వేష, "భాష"లతో కాదని నేను బలంగా నమ్ముతాను" అని జె.డి.చక్రవర్తి అన్నారు. ఈమేరకు ఆయన ఒక వీడియో సైతం విడుదల చేశారు.




Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com